# తేనెటీగలు

రేపు అక్షయ సంక్రాంతి. చలికాలం అలా చూస్తుండగానే పొద్దుగూకింది. చతుర్దశి వెన్నెల మెల్లిమెల్లిగా పౌర్ణమి వెన్నెలగా విచ్చుకుంటూ వాకిళ్ళలో పరుచుకొంటున్నది.

కరుణాకర్‌కు రేపటి పండుగ (చక్రాల) సకినాల అప్పాలతో సహా మృష్టాన్న భోజనం ఆ రోజే దొరికినట్టుగా భుక్తాయాసంగా వుంది. భుక్తాయాసం లాగా హుందాగా అడుగులో అడుగువేస్తూ నడుస్తున్నాడు. పొగాకు (తంబాకు) నమిలి దవడకు ఒక మూలన నెట్టి రసాన్ని ఆనందంగా గ్రోలుతున్నట్టుగా వుంది. అప్పుడప్పుడు నోట్లో నీళ్ళెక్కువై తుపుక్కు తుపుక్కున వుమ్ముతున్నాడు. నిండా చుట్టుకున్న మఫ్లర్ కొసలు అటూ యిటూ వూగుతున్నాయి. అతని చేతిలో ఆ ప్యాకెట్ అతనితో పాటు ఓ మినీ మెడికల్‌షాపు నడుస్తున్నట్టుగా వుంది. అతని కళ్ళు మాత్రం అలవోకగా అటుయిటు చూస్తున్నాయి. ఆ యింటికేసి తాపీగా నడుస్తున్నాడు.

వాతావరణం చాలా చలిగా ఉంది. చెవుల నిండా కప్పుకున్నా చలి వణికిస్తూ ఉంది. పిల్లలు తలనిండా గుడ్డలు చుట్టుకొని అమ్మ వేసే ముగ్గులను ఆసక్తిగా చూస్తున్నారు. అక్కయ్యలు కళాపిజల్లిన వాకిట్లో పోటీలుపడి ముగ్గులేస్తుంటే పిల్లలు సంతోషంతో చప్పట్లు చరుస్తున్నారు. ఎక్కణ్ణించో సకినాలు, గారెలు కాలుస్తున్న కమ్మటి వాసన వీధి వీధంతా వ్యాపిస్తోంది. పండుగ రేపయినా పనులన్నీ యివాళే పూర్తి చేసుకుంటున్నట్టున్నారు. వీధులన్నీ కళాకాంతులు వెదజల్లడానికి హడావుడి పడుతున్నాయి.

ఆ యింట్లో ఏ అలికిడీ లేదు. ఉండి వుండి మూలుగు వినిపిస్తోంది. ఇవేవీ అతనికి పట్టినట్లు లేదు. మంచంలోంచి అందరినీ పేరుపేరున కలవరిస్తున్నాడు. ఆగిఆగి వినిపిస్తున్నాయి.

"సారవ్వా .......... చిట్టీ ........... లచ్చవ్వా .......... వదినా ......... మీ అందరికీ అన్యాయంచేసి పోతున్నాను. .......... చిట్టీ నాన్నేదని ఏడుస్తూ రోజూ అమ్మని ఏడ్పించబోకు. అమ్మ చెప్పినట్టుగా బుద్ధిగా నడుచుకుంటావు కదూ ........ సారవ్వా ........ నీ జీవితమంతా కష్టాలే ............ నిన్ను ఏనాడు సుఖపెట్టానని ? నాకోసం నువ్వు ఎన్నో కష్టాలపాలయ్యావు ....... మేనబావనే చేసుకుంటానని పట్టుబట్టిన నీకు ఏం మిగిల్చాను ? కష్టాలు కన్నీళ్ళు తప్ప ......... ఇంత అకస్మాత్తుగా మిమ్మల్నందర్నీ వదిలివెళ్ళి పోతున్నందుకు మన్నిస్తారు కదూ! .........."

అలా ఎంతసేపట్నించి పలవరిస్తున్నాడో తెలియదు. రాత్రి ఎనిమిది కావస్తోంది. కరుణాకర్ తలుపు తీసేసరికి యింకా పలవరిస్తూనే వున్నాడు.

కరుణాకర్‌కు అది కలతనిద్రో సంధి ఆలాపనో తెలియలేదు. గాభరాపడిపోయాడు. ఇక్కడే చచ్చిపోతే ? యింకేమయినా జరిగితే......? తాను యిక్కడే చిక్కుకుపోతే ఏమిటి

చేయడం? అనే ఆలోచన రావడంతో మరింత కలవరపడిపోయాడు. అతడి నొసటిపై చెయ్యివేసి చూశాడు. ఒళ్ళు తడిమి చూశాడు.

జ్వరంతో అతని ఒళ్ళు సలసలకాగుతోంది. రెండు పక్కదుప్పట్లు బిగదీసుకు కప్పుకున్నా గజగజ వణుకుతోంది శరీరం.

మెల్లెగా పక్కదుప్పటి తొలగించి చూశాడు కరుణాకర్. అంత చలిలోనూ అతడికి వొళ్ళంతా చెమటలు పడ్తోంది. తెల్లగా, ఎర్రగా వాచిపోయిన పుళ్ళని చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

"కామ్రేడ్ .......... అన్నా కామ్రేడ్ .........." మెల్లిగా ఒళ్ళు పట్టి ఊపుతూ లోగొంతుతో పిలిచాడు కరుణాకర్.

"ఊఁ" అని కొద్దిగా పక్కకు పొర్లాడే గాని కళ్ళు తెరవలేదు పోషాలు.

తలుపులు ఓరగా వేసి తన ఫ్రెండ్ చంద్రంకోసం ఆదరాబాదరాగా పరుగెత్తాడు కరుణాకర్. వాళ్ళిద్దరు కలిసి ఏదో కాస్త పరిచయమున్న డాక్టర్ని పిల్చుకొచ్చారు. డాక్టర్ రెండు ఇంజక్షన్లు వేసి, కొన్ని మందులిచ్చి పొద్దున్న క్లినిక్‌కు తీసుకురమ్మని చెప్పి వెళ్ళిపోయాడు. డాక్టర్ని పంపించేశాక తోడుగా చంద్రం కూడా అక్కడే వుండిపోయాడు.

రాత్రి పదింటికి గాని ఆ కలవరింతలు వణుకు తగ్గలేదు. క్రమంగా ప్రశాంత నిద్రలోకి జారుకున్నాడు అతను. మాటిమాటికీ నొసటిపై చేయివేసి చూస్తున్నాడు కరుణాకర్. టెంపరేచర్ కొద్దికొద్దిగా తగ్గుముఖం పడ్తోంది. 'హమ్మయ్య' అని నిట్టూర్చాడు కరుణాకర్.

అయినా రాత్రంతా మెలకువతోనే వుందామని నిశ్చయించుకున్నారు వాళ్ళు. కానీ అంతకు రెండురోజుల క్రితం నుండి నిద్రలేదు.

రాత్రి నాలుగు గంటల ప్రాంతంలో పోషాలు బాగా మూలుగుతూ మెల్లిగా మంచంలోంచి లేచాడు. అప్పటికి చంద్రం, కరుణాకర్‌లు అతడి మంచం పక్కనే గాఢనిద్రలోకి వెళ్ళిపోయారు.

ఆయాసంగా మెల్లిగా కుంటుతూ అదీ యిదీ ఆసరా పట్టుకుంటూ కలలోలాగా లేచి నిలబడ్డాడు అతను. కలలో నడుస్తున్నట్టుగా గోడలు ఆసరా చేసుకొని అడుగులు తడబడుతూనే డోర్ చేరుకున్నాడు. డోర్ తీసి పాస్‌కి వెళ్ళొచ్చి మంచంలో కూర్చున్నాడు. మగత యింకా వదిలినట్టులేదు. కలల్లోంచి సంఘటనలు అతన్ని యింకా వెన్నాడుతున్నట్టుగా తనచుట్టూ కలియజూసుకున్నాడు. జరిగిందంతా కొద్దికొద్దిగా గుర్తొస్తోంది.

అతను యిటుక పనికి వెళ్ళడం .......... సంక్రాంతి పండుగ అప్పాలు చేస్తానని సారవ్వ చెప్పడం ....... పనికి వెళ్ళి అటునుంచి అటే పొయ్యిలోకి పుల్లలు కొట్టుకొద్దామని తాను వెళ్ళడం ...... చీకటిపడ్డంతో కొట్టినకాడికి మోపుతో సహా బయల్దేరడం ...... ఊళ్ళోకి చేరుకునేంతలో దయ్యాల చింతకాడ ఒక్కసారి వాళ్ళు మీద పడ్డం ..... జీపులో పడేసి తీసుకుపోవడం ...... లాకప్పులో చిత్రహింసలు ......... దెబ్బలకు, చిత్రహింసలకు ఒళ్ళంతా పుళ్ళవడం ..........జ్వరం రావడం .......... చివరకు ప్రాణం పోతే పోయిందని ధైర్యంచేసి క్రితం రోజు ఉదయం తప్పించుకోవడం .......... నిన్నంతా ఎక్కడెక్కడో గడపడం ...... ఒకవైపు స్పృహ కోల్పోతూ మగత కమ్మడం ...... ఇక చాతగాదని నిర్ణయించుకోవడం ...... యింటికి వెళ్తే యిక లాభం లేదని ఈ వూరు రావడం ...... తెలిసిన వాళ్ళు చంద్రంను తోడిచ్చి యిక్కడికి పంపడం ....... ఆ వెంటనే మగత కమ్మి అలసటగా మంచంలోకి వొరిగిపోవడం ....... అన్నీ ఒక్కొటొక్కటిగా గుర్తొస్తున్నాయి.

కడుపులోని ఆకలి కూడా కొద్దికొద్దిగా స్పర్శకు వస్తోంది.

అది చంద్రం క్లాస్‌మేట్ రూము. అతను సంక్రాంతి సెలవులకు యింటికి వెళ్తూ చంద్రానికి తాళం చెవులు ఇచ్చివెళ్ళాడు. గిన్నెలన్నీ చిందరవందరగా పడేసివున్నాయి.

గిన్నెలన్నీ వెదికాడతను. ఉసూరుమంది ప్రాణం. వాళ్ళిద్దరినీ లేపి ఏదైనా తినడానికుందేమో అడగాలనుకున్నాడు. అది వాళ్ళ రూం కాదని అతనికి తెలియదు. వాళ్ళకేసి చూశాడు. అస్తవ్యస్తంగా అంత చలిలోనూ ఉన్న పక్కదుప్పట్లన్నీ తనకే ఇచ్చేసి కింద న్యూస్‌పేపర్ పరుచుకొని పైన చాప కప్పుకుని ముడుచుకొని పడుకున్నట్టున్నారు. వాళ్ళని లేపడానికి మనసొప్పడం లేదు. మళ్ళీ మంచంలో ఒరిగి కళ్ళు మూసుకున్నాడు.

అతనికి ఎందుకో యిక యింతటితో ఇంటికి వెళ్ళడం ఆగిపోయినట్టేననే విషయం గుర్తొచ్చింది. ఆ విషయం గుర్తుకు రావడంతోనే మరెన్నో విషయాలు గుర్తుకు రాసాగాయి. ఎందుకో కనుకొనుకుల్లో నీళ్ళు తిరిగాయి.

ఏదో కలలాగా అందరూ అతని కళ్ళ ముందుకొచ్చారు. అతనికేసి ఆశగా, దీనంగా నిస్సహాయంగా చూస్తున్నారు.

సారవ్వ భోరున ఏడుస్తోంది. ఏడేళ్ళ చిట్టీ అందరిలాగే తనకూ నాన్న వుండద్దా అని అతని ఛాతీపై కొడ్తూ ఏడుస్తూ ప్రశ్నిస్తోంది. అన్నా వదినా మేం చేసిన సాయం మరిచావా మమ్మల్ని నట్టేట ముంచుతావా అని నిస్సహాయంగా వేడుకుంటున్నారు. అతనికోసం చేసిన అప్పుల కారణంగా లచ్చవ్వ పెళ్ళి ఆగిపోయిందని కుమిలికుమిలి ఏడుస్తున్నారు.

ఒక్కొక్కరు కళ్ళ ముందు కదులుతున్నకొద్దీ అతనికి తెలియకుండానే కళ్ళలోంచి వెచ్చని కన్నీల్లు ధారలు కడుతూ చెంపలమీంచి జారి మెడమీదుగా పక్కదుప్పటిలోకి యింకుతున్నాయి.

అలా ఎంతసేపు ఉండిపోయాడో తెలియదు. ఎక్కడో కొక్కొరొకో అనడం విన్పించింది. వాకిళ్ళలో గొబ్బెమ్మలు (గౌరమ్మలు) పెడుతున్న గాజుల గలగలలు, వెండి పట్టాల కాళ్ళ కదలికలు వినపడ్తున్నాయి. ఈవేళకి సారవ్వ లేచి మంచంలో కూర్చుని ఏడుస్తూ వుండి వుంటుంది. చిట్టి లేచి తల్లిని కరుచుకొని బెంగగా నాన్నేడని ఏడుస్తూ వుండవచ్చు. వారం రోజులుగా తనకోసం తిరుగుతూ, కళాపి (అలుకు) చల్లని వాకిలి ..... ఎండిపోయిన పందిరితీగలా సారవ్వ ........ పండుగ కళ కోల్పోయిన వదిన యిల్లు ..........

దసరా, దీపావళికి ఎలానూ లేదు తను ...... ఈ సంక్రాంతికి చిట్టికీ లచ్చవ్వకూ కొత్త బట్టలు కొనిపెడ్తానని మాటిచ్చాడు. వాళ్ళు ఎంత సంతోషపడిపోయారో ..... అన్నావదినలకీ, సారవ్వకీ తలా ఒక జత మంచిబట్టలు కొనిపెడ్తామనుకున్నాడు. చెల్లెలు కూతురు ఈ పండుక్కి గాజులయినా కొనిపెట్టవా మామయ్యా అంటూ ఎంత గారాబం పోయిందో ......... అదంతా జరిగిన కథయిపోయింది. ఇప్పుడు తనకోసం తాను ఏమైపోయాడో ఎలా వున్నాడోనని కళ్ళలో వత్తులు వేసుకొని ఎన్ని వూళ్ళు తిరుగుతున్నారో ....... ఎవరెవరి కాళ్ళు పట్టుకుంటున్నారో .......... తాను క్షేమంగా వున్నట్టు వాళ్ళకు తెలపడం కనీస ధర్మం........

మెల్లిగా భారంగా లేచాడు అతను. కుంటుతూ అలసటగా, ఆయాసంగా గోడ ఆసరాగా టేబుల్ వద్దకు చేరాడు. కాగితం కలం తీసుకున్నాడు. రాస్తుంటే ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి. సన్నగా టెంపరేచర్ మళ్ళీ పెరుగుతున్నట్టుగా వుంది.

అతను రాసిన ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకొని చూశాడు. 'ఇది వీడ్కోలు లేఖ' ఎందుకో అతని చేతులు వణికాయి. కళ్ళు తుడుచుకున్నాడు.

"......... వదినా ....... అన్నా ........ సారవ్వా ..... మీరన్నట్టు మిమ్మల్ని ఎన్నో కష్టాల్లో వదిలివెలుతున్నాను. .......... నేను నిజంగా లచ్చవ్వ పెళ్ళి అయ్యాకే వెళదామనుకున్నాను. ఈ సంక్రాంతి, శివరాత్రి ముహుర్తాల్లో పెళ్ళి కుదురుతుందని గట్టిగా నమ్మకం వుండింది. దాని పెళ్ళి నా చేతులమీదుగానే చేద్దామనుకున్నాను. కానీ అన్నీ మన చేతుల్లో లేవు గదా! నాకన్నా ముందే వాళ్ళు తొందరపడ్డారు. తద్వారా నన్ను తొందరపెట్టినట్టయింది.

మీరు నాకోసం ఇప్పించిన స్యూరిటీల కోసం మనవూరి సంగమూ, చుట్టు పక్కల సంగాల తరుపునా కొంత మొత్తం జమచేస్తున్నారు. అయినా ఇంకా పెద్ద మొత్తమే మీమీద పడవచ్చు. ఒక మంచిపని కోసం కర్చుపెట్టామనే తృప్తి మిగిల్చడానికి నా చివరి రక్తపు బొట్టువరకూ కృషిచేస్తాను. అయితే మీరన్నట్టు మీరు ఇప్పించిన స్యూరిటీలన్నీ కలిపి లక్షాపదివేలు గనక-నేను వెళ్ళిపోవడం అంటే ఇంత సొమ్ము మీనుంచి తీసుకొని పారిపోతున్నానన్నట్టే ...... వేరే మాటల్లో చెప్పాలంటే మీరూ చుట్టుపక్కల సంగాలన్నీ కలసి ఒకరకంగా నన్ను మన ప్రాంత ప్రతినిధిగా యుద్ధరంగానికి పంపుతున్నారనుకొనవచ్చు. అలా నా బాధ్యత మరింత పెంచారు. అయితే వదిన అన్నట్లు ఇంత మందిని కష్టపెట్టి వెళ్ళినా ఆశపెట్టి వెళ్ళినా నేను ఎన్నాళ్ళు బతుకుతానో తెలియదు. ఏ నెలకో రెణ్ణెల్లకొ దొరికితే ఎన్‌కౌంటర్ కథ అల్లినా అల్లవచ్చు. ఇంతకు ముందులాగా ప్రాణాల్తో వుండకపోవచ్చు. అప్పుడు ఎన్‌కౌంటర్లు ఇంత ఉధృతంగా లేకపోవడం ఒకటి ........ అప్పుడు పార్లమెంటు ఎన్నికల హడావుడి వుండడం మరొకటి ........... ఎన్ని చిత్రహింసలపాలయినా ఇలా ప్రాణంతో మిగలగలిగాను. ఇప్పుడా ఆవకాశం లేదు. దొరికినా కాల్చి చంపేస్తారు. లేదా నిజంగా ఎదురుకాల్పుల్లోనే చనిపోవచ్చు.

వదినా .... నేను జైళ్ళో ఉన్నపుడు ఏం చెప్పానో ....... ఎలా మాట్లాడానో ........ బయటకు వచ్చి ఏంచేస్తున్నానో ఆలోచించుకో అని హెచ్చరించావు. బతిమాలావు. పది కుటుంబాలు నా వల్ల ఆగమైపోయాయని ....... నీ మనస్సు నాకు తెలుసు వదినా ....... నన్ను మీరు మనస్సులో మనసారా ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

నాకోసం ఎక్కడా వెదకవద్దు. నేను ఉత్తరం రాసిన విషయం కూడా ఎవరికీ తెలియనీయవద్దు.

చిటీలు! ఈ పండక్కి నీకూ లచ్చవ్వకూ కొత్తబట్టలు తెస్తానన్నాను. పుట్టి బుద్దెరిగిన్నించి నాన్నను చూడ్డం యిదే కదూ ....... నేను తొలిసారిగా కొత్త బట్టలు కొందామనుకున్నాను. కానీ యిలా అయిపోయింది. ఏడవకు చిట్టీ ....... నాన్న ఒక మంచిపని కోసం వెళుతుంటే ఏడుస్తారటమ్మా ! మా మంచి చిట్టివి కదూ ....... ఒక ముద్దివ్వమ్మా ........ టా ..... టా ..... ఏదీ అలా చెయ్యి వూపు .........

అందరికీ విప్లవాభినందనలతో ........ పోషాలు'

రెండు కన్నీటి బొట్లు ఉత్తరం మీద జలజలా రాలాయి.

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకున్నాడు.

చంద్రం, కరుణాకర్‌లకేసి చూశాడు. వాళ్ళు చాపకింద నుంచి యిప్పుడిప్పుడే లేచేట్టులేరు.

అరిపాదాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఒంటినిండా చాప కప్పుకొని ఇద్దరు ఒకరినొకరు కరుచుపోయినట్టున్నారు. కరుణాకర్ టేబుల్‌మీద పెట్టిన మందుల ప్యాకెట్ నుంచి తనకు కావలసిన మందులేవో కొన్ని తీసుకొని సర్దుకున్నారు. ఏమనుకున్నాడో ఏమో ....... తనకోసం ఎదురుచూడవద్దని, తాను క్షేమంగా వెళ్ళి పోతున్నానని, ఉత్తరం రాసి టేబుల్ మీద కనబడేటట్టు పెట్టాడు.

గోడ ఆసరాతో మెల్లిగా బయటకు నడిచాడు. ఒళ్ళంతా నొప్పులు. నిన్నంతా ఏమీ తినని ఆకలి. నిస్త్రాణ. మళ్ళీ మగత కమ్ముతోంది. అయినా ముందుకే కదిలాడు తప్ప వెనుదిరగలేకపోయాడు.

తలుపు తీశాడు. చలిగాలి విసిరికొట్టింది. పుళ్ళన్నీ జివ్వుమన్నాయి. పదడుగులు వేశాడో లేదో గొబ్బెమ్మ (గౌరమ్మ) లపై కాలుపడి జారి తూలిపడుబోయాడు. అయినా ముందుకే చూశాడు.

భోగి మంటలు యింకా ఎర్రగా అతని హృదయంలా మండుతూనే వున్నాయి. అవి వదిలిన పొగా, పొగమంచు దట్టంగా పరుచుకుంది. ఆ పొగమంచులోంచి అప్పుడప్పుడే తూర్పు తెలవారుతోంది. దక్షిణాయన కాలం నుంచి అంపశయ్య మీద భీష్ముడు ఎన్నాళ్ళుగానో ఎదురుచూసిన ఉత్తరాయణ కాలపు తొలిపొద్దు అప్పుడే ఎర్రగా విచ్చుకుంటోంది.

వీధి మొగలో భోగిమంటలకాడ తలారా స్నానంచేసి పాలబుగ్గల్లో అమాయకత్వపు పసిడి నవ్వుతో వెలిగిపోతున్న పసిపాప అతనికేసి తదేకంగా చూస్తోంది. అతడూ అటుకేసే చూశాడు. కొత్తబట్టల్తో, కొత్త గాజుల్తో నొసటి కుంకుమతో ధగధగా మెరుస్తూంది పాప ........ చింకిరి బట్టల్లో, చిప్పిరి వెంట్రుకలతో చిట్టి తనకోసం వాకిట్లో నిలబడి ఈ పండగపూట ఏడుస్తున్న దృశ్యం గుర్తొచ్చి మనస్సు కలుక్కుమంది. కాలుజారి మళ్ళీ నడుం పట్టుకుంది. అయినా మెల్లెమెల్లగా అడుగులు వేస్తూ ముందుకు సాగాడు అతను.

అలా నడుస్తూ నడుస్తూ మగతలోకి జారిపోయేటప్పటికి మళ్ళీ కరుణాకర్ చేతుల్లో వున్నానని అతనికి తెలియదు.

*   *   *

వేసవిలో ఆకు రాలిన అడవి బయలు బయలైపోయింది. తునికి ఆకు తెంపే సీజన్ పూర్తికావచ్చింది. కళ్ళాలు లేచిపోతున్నాయి.

అక్కడక్కడా కొన్ని చెట్లు చిగురుస్తున్నాయి. ఆకులన్నీ రాలిపోయినా అవేవో చెట్లు నిండుగా ఎర్రపూలు పూస్తున్నాయి. అయినా అడవి యింకా పచ్చబారలేదు. రెండు వర్షాలు గట్టిగా కురిస్తేనే కాని గడ్డీ ఆకు, పొదా పొరకా పెరిగి మళ్ళీ నిండుగా కానరాదు. వేసవి సెలవులు గడిచి మళ్ళీ బళ్ళు తెరిచినా, ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ ప్రాంతంలో 1987 జూన్ 14 సైతం సగం గడిచిపోతున్నా ఒక్క వర్షపు చినుకు జాడలేదు. అడవిలోని ఏర్లు మడుగులు ఇంకా ఎండిపోతున్నాయి. పక్షులు జంతువులు నీటికోసం మడుగులుచేరి వేటగాళ్ళ పాలబడి నేలకొరుగుతున్నాయి. మంచినీళ్ళ కోసం వర్షంకోసం ప్రజలూ ప్రకృతీ అల్లాడిపోతున్నారు.

వేసవి కొందరికి వసంతంలా తోస్తుంది. తమకు మాత్రం ఇది ఆకురాలు కాలంగానే వుంటోందని నిట్టూర్చాడు పోషాలు.

పోషాలుకు నిన్ననగా చీరుకుపోయిన చెయ్యి భుజమూ ఇప్పుడిప్పుడే నొప్పి పెరుగుతోంది. క్రితం రోజు ఎన్‌కౌంటర్ హత్యలకు నిరసనగా రెండు బస్సుల్ని, ఒక లారీని తగులబెట్టారు. అప్పుడు ఏదో గుచ్చుకొని చెయ్యి గీరుకుపోయింది. నెల క్రితం కూడా అదే భుజానికి దెబ్బ తగిలింది. 'గుప్తాల' పల్లె ఫారెస్టు ప్లాంటేషన్‌ని అందర్తో పాటు పీకేస్తుంటే జారి వెల్లికిలా పడి ఇదే భుజం గీరుకుపోయింది. అంతేసి పోలీసు లాఠీల్ని ఓర్చుకున్న భుజం ఇప్పుడు పచ్చిపుండులా జలుపుతోంది. టాబ్లెట్లు, ఇంజెక్షన్లు అయినా భుజం నొప్పి జ్వరంలోకి దింపుతున్నట్లుగా వుంది. దానికితోడు లారీని, బస్సుల్ని కాల్చివేశాక జాగ్రత్తకోసం రాత్రంతా మెళుకువతోనే వుండిపోయారు. దళ కమాండర్ సాయన్న ఏదో చెపుతున్నాడు. వినాలని వున్నా శరీరం తన ఆధీనంలో లేకుండా పోయింది. నిద్ర మగతా కమ్ముకువస్తూంది.

పోషాలుకు రాత్రి కలతనిద్రలో వచ్చిన కల గుర్తొచ్చింది. సారవ్వా, చిట్టీ, వదినా, లచ్చవ్వా, అన్నా అంతా కళ్ళ ముందు కదలాడారు. దీనంగా అతనికేసే చూస్తూ గోదుగోడున ఏడుస్తూన్నారు. వాళ్ళ ఇళ్ళు నేలమట్టం చేయబడ్డాయని, ఉన్నదంతా అమ్మేసినా ష్యూరిటీకి దబ్బులు చాల్లేదని, మరెవరో సంగం తరవున ష్యూరిటీలు కదుతుంటే వాళ్ళనీ, వాళ్ళతో పాటు అన్ననీ, బావమరిదినీ 15 రోజుల నుంచి లాకప్పులో హింసిస్తున్నారనీ ..... ఇటీవలే కరుణాకర్ వార్త మోసుకొచ్చాడు.

అతడి భుజంలో ఎక్కడో కలుక్కుమంది. బాధతో అతని హృదయం మెలికలు తిరుగుతోంది. పచ్చని తాటాకులు పరుచుకున్నవాడల్లా కూర్చున్నట్టుగానే మెల్లిగా ఒక పక్కమీదకు వెల్లికిలా ఒరిగాడు.

సాయన్న చెబుతున్న విషయాలు పోషాలు ఎన్నెన్నో జ్ఞాపకాల పొరలను తవ్వితీస్తున్నాయి.

అతను అన్నా వదులుకొని ఎన్నెన్నో ఆశలతో ఇక్కడికొచ్చాడు. అతను విడుదల అవుతున్నాడనీ తెలిసి జైళ్ళోని మిత్రులు కూడా అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమ వంతు కర్తవ్యం కూడా చేపట్టాలని అప్పగించారు. వాళ్ళతో ఎన్నో బాసలు చేశాడు. జైల్లోని కామ్రేడ్స్ కోరిందొకటి. ఇక్కడ జరుగుతున్నది మరొకటి.........

ఈ శారీరక బాధకన్నా తమవాళ్ళ మరణం అతన్ని భరించలేని పచ్చిపుండులా బాధపెడ్తోంది.

వారం రోజుల క్రితం అసిఫాబాద్ తాలూకా 'నెన్నెల' లో ముగ్గురు ...... నిన్నగాక మొన్న బోథ్ తాలూకా 'చింతబొరి'లో నలుగురు ..... వారం తిరిగేలోగా ఏడుగురు.......

వీళ్ళంతా అతనితో కలిసి తిరిగినవాళ్ళు ....... కలిసి తిన్నవాళ్ళు ...... ఒకే పక్కలో పదుకున్నవాళ్ళు ....... ఒకే హృదయంగా బ్రతికినవాళ్ళు ...... ఉన్న దళం విడిచి - అవసరాల రీత్యా కొత్త దళంలోకి వెళ్ళాల్సివచ్చినపుడు - తల్లిని వదిలి పొమ్మంటే ఏడ్చే పిల్లల్లా హఠం పెట్టి ఏడ్చినవాళ్ళు. అంతగా అల్లుకుపోయిన అనుబంధాలు.

పోషాలు గడిపిన రెండేళ్ళ రైతుకూలీ సంఘం జీవితం, అయిదేళ్ళ దళ జీవితం, రెండేళ్ళ జైలు జీవితంలో ఎన్నో జిల్లాల వాళ్ళు, ఎన్నో రాష్ట్రాలవాళ్ళు, ఎన్నో తీరుల్లో పరిచయమయ్యారు. ప్రాణ స్నేహితులయ్యారు. ఆ అనుబంధాల అనుభూతులు ఒకటిగా పెనవేసుకుపోయాయి.

ఇలాంటి వాళ్ళు ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, వారం తిరిగేలోపు ఏడుగురు ........ ఈ ఏణ్ణర్థంలో నూట ఇరవై మంది.

బాధగా నిట్టూర్చాడు పోషాలు. కనుకొలుకుల్లో పేరుకుపోయిన కన్నీళ్ళు చెవుల్లోకి

వెచ్చగా జారుతున్నాయి.

సాయన్న ఇంకా ఏదో చెబుతూనే వున్నాడు. కళ్ళు మగతగా మూసుకొన్నాడన్న మాటేగాని పోషాలుకు అంతా కళ్ళకు కడుతోంది.

ప్రతి కామ్రేడూ ఎన్నో ఏళ్ళ కృషి ఫలితం. ఒకరు సాదా జీవితం నుండి కార్యకర్తగా ఎదగాలంటే ఎన్నో అనుభవాలు తోడవ్వాలి. ఎన్నో క్లాసులు, విలేజి క్యాంపెయిన్‌లు, ఎంతో ఆచరణ, ఎన్నో పోరాటాలు, నిర్బంధాలు వీటి గుండా స్వచ్ఛంధంగా పయనిస్తూ మధ్యలో వెనక్కి తగ్గేవాళ్ళు తగ్గగా ఇలా చివరికంటా మిగులుతూ జీవితాన్ని అర్పించడానికి ముందుకొచ్చే కార్యకర్తలుగా తయారవడానికి ఎంతో కృషి, ఓపికా, పట్టుదలా కావాలి.

వాళ్ళంతా ఎన్నెన్నో పోరాట ప్రేరణలతో వచ్చినవాళ్ళు. ఎన్నో ఆకాంక్షలతో ప్రజలు చేసిన ఒక్కొక్క పోరాటానికి ప్రతినిధులు వాళ్ళు. ఒకే పోరాటపు సారాంశంగా ఉదయించినవాళ్ళు.

ఎక్కడో పుట్టారు. ఎక్కడో పెరిగారు. ఎన్నో పాయల్లోంచి, జిల్లాల్లోంచి ఎదిగివచ్చి ఇక్కడ ఇలా అడవిలో కలిశారు. అన్నదమ్ములకన్నా, అన్నాచెల్లెల్లకన్నా మిన్నగా కలిసిపోయారు. అదంతా ఎంతో విచిత్రంగా కన్పించినా, ఎంతో సహజంగా జరిగిపోయింది. ఒక్కొక్కరు మోసుకువచ్చిన అనుభవాలు పంచుకోవడంతో అందరి అనుభవాలు అల్లుకుపోయాయి. అనుబంధాలు పెనవేసుకుపోయాయి.

వాళ్ళు చనిపోయిన నేల రక్తసిక్తమయింది. వాళ్ళ కడుపులో పేగులు తెగి కిందపడ్డాయి. తలలోంచి గుళ్ళు దూసుకుపోయి మెదడు బయటకు వచ్చింది. గుళ్ళు దిగిన భుజం, సగం తెగి వేలాడుతున్న చెయ్యి, దాహంతో ఆర్చుకుపోయే గొంతు, రక్తం ఓడుతూ వేలాడే నరాలు–అయినా ఎన్నో గజాల దూరం పాకుతూ పాకుతూ దారిపొడుగునా నెత్తురు ధారలు కడుతుంటే వాళ్ళు మరిన్ని తూటాలు పేల్చారు .....

...... ఎన్నెన్ని ఘోరాలు ఎంతో అవలీలగా జరిగిపోతున్నాయి. ఎన్నెన్నో మానభంగాలు జరుగుతున్నాయి. అక్కడ తూర్పు గోదావరిమన్యంలో ఎన్నెన్నో గూడేల్ని కాల్చారని వార్త. ఇక్కడ ఎన్నెన్నో యిళ్ళని, గుడిసెల్ని నేలమట్టం చేస్తున్నారు. చిత్రహింసలు పెరుగుతున్నాయి.

ఎక్కడో సుడిగాలి లేచినట్టుంది. రాలిపోయిన ఆకుల్ని పరపరమంటూ పైకిలేస్తున్నాయి. దుమ్మూ ధూళీ యిటుకేసే వస్తోంది. చెట్లు ఊగిపోతున్నాయి. గాలి వేడిగా మండుతూ మండిస్తోంది. పైకి ఎగిరిన పక్షులు అదేపనిగా అరుస్తున్నాయి. చిమ్మెటలు ఒక్కసారిగా గమ్మునుండిపోయాయి. అయినా తేనెపట్టు మీంచి తేనెటీగలు అంగుళమైనా కదలట్లేదు. గాభరాపడ్డంలేదు.

కమాండర్ సాయన్న పరిస్థితి మొత్తాన్ని సమీక్షిస్తున్నట్టున్నాడు.

"కామ్రేడ్స్! మనం మొదట్లో ఈ ఫారెస్టుజోన్‌లో ఎంటరయినపుడు మన పరిస్థితి ఏమిటో మనకందరికీ తెలుసు. గిరిజనగూడేల్ని, అడవినీ సర్వేచేస్తూ వాళ్ళతో మాటలు కలుపుతూ గజ్జల గంగన్న మొదలుకుని అందరం ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేశామో మీకు తెలుసు. ఆనాడు ఒక్కరంటే ఒక్కరయినా ముందుకొచ్చి మనకు తిండి పెట్టని స్థితి.మనం అప్పుడు కిట్‌లో బియ్యం మోసుకు తిరిగేవాళ్ళం. కొన్ని వూళ్ళలో మనల్ని దొంగలనుకొని తరిమికొట్టారు. పోలీసులకు పట్టించారు. అటు పోలీసులు, యిటు మనల్ని నమ్మని ప్రజలు. మరోవైపు అంతు తెలియని అడివి. అడవిలో జంతువులు. ఎక్కడా ఓ గంటయినా స్థిరంగా కూర్చోవడానికి,

నిల్చోడానికి వీలుకాని స్థితి. ఓపూట తినీ తినకా, ఉడికీ ఉడకకా, అర్థాకలితో రాత్రిళ్ళు సైతం నడుస్తూ కోడికూరుకులాగా యింత నిద్రతీసి మళ్లీ ప్రయాణం. అలాంటిది ఈరోజు ఉద్యమమూ దాంతో పాటు నిర్బంధమూ ఎంత పెరిగిందో మనందరికీ తెలుసు."

సాయన్నకు దాహంగా వున్నట్టుంది. చురుకేసినట్టుగా పొత్తికడుపులో మంట మండుతోంది. నోరు పిడచగట్టుకుపోతోంది. నీళ్ళ కోసం చూశాడు.

"నీళ్ళయిపోయాయి. రెండు గంటల్నించి రేషన్ సిస్టం నడుస్తోంది. అందరికీ ఒక్కటే గుక్కెడు. నువ్వు మాట్లాడుతున్నావు గనుక ఇంకో గుక్కెడు అంతే" అని నవ్వుతూ నీళ్ళు అందించింది లక్ష్మి.

కరుణాకర్‌కు ఆవేదనగా వుంది. ఆవేశంగానూ ఉంది.

ఒక హత్యకు పదిహత్యలు అని మనం గోడలమీద రాయడం వరకేనా? పోలీసులు పిచ్చిలేచిన వేటకుక్కల్లా వెంటాడుతున్నారు. రూముల్లో పట్టుకుని ఎన్‌కౌంటర్ అంటున్నారు. మాటుగాసి చంపుతున్నారు. ఏ గూడేనికి వెళ్ళినా ఏం దాదా యింకా చూస్తూ ఊరుకుంటారేం? అని నిలదీస్తున్నారు. తాను దళంలో చేరినప్పటినుంచి చూస్తున్నాడు. ఎప్పుడూ డిఫెన్స్ తీసుకొని రిట్రీటయి తప్పుకుపోవడమే. అలాగయినా క్షేమంగా రాగలిగితే ఈ బాధంతా ఎందుకు?

కరుణాకర్ యిప్పుడు పిప్పల్‌దారి ఏరియాలో పనిచేస్తున్నాడు. అపుడపుడు ఏవో అవసరాల రీత్యా వచ్చి కొద్దిరోజులు వుండిపోతాడతను. అయినా అందరూ తెలిసినావాళ్ళే.

అడవిలో సుడిగాలి మరింత వేగాన్ని అందుకుంది. చెట్లన్నీ కొమ్మల్తో సహా ఊగిపోతున్నాయి. తేనెటీగలు తేనెపట్టు నించి లేచి అప్పుడప్పుడే మెల్లగా రొదపెట్టడం ప్రారంభించాయి.

సాయన్న చర్చని సమ్మప్ చేస్తున్నట్టున్నాడు.

"....... నిర్దిష్ట స్థల కాలాల్లో నిర్బంద ప్రభావాలు వేరువేరుగా ఉంటాయి. కనుక నిర్బంధం విరుచుకపడక ముందూ – ఆ తర్వాత ప్రజల భావాల్లో కలిగే మార్పుల్ని, పరిస్థితుల్లో వచ్చే మార్పుల్ని నిర్దష్టంగా మనం ఎప్పటికప్పుడు విశ్లేషించుకుందాం. విశ్లేషిస్తూ ఆచరిస్తూ మన అనుభవాల్ని బేరేజు వేసుకుందాం ప్రస్తుతం ఈ ప్లాన్లని ఆమోదిస్తున్నాం. సాహసించి పోరాడుదాం. ప్రభుత్వ దాడిని ఓడిద్దాం. గెరిల్లాజోన్‌ను నిర్మిద్దాం." అంటూ నినదించాడు సాయన్న. మిగిలినవాళ్ళు ప్రతిస్పందించడంతో అడవి ముమ్మారు ప్రతిధ్వనిస్తూ తద్వారా తథాస్తు అని ఆశీర్వదించింది.

ఉత్సాహంతో పోషాలు మెల్లగా లేచి కూర్చున్నాడు. పుండు సలుపుతున్నా తన కిట్టు తానే వేసుకోబోయాడు. కరుణాకర్ వారించి తన కిట్టుపై అతని కిట్టుని వేసుకున్నాడు. పోషాలు తన తుపాకిని తీసుకుని లక్ష్మి వెనుకగా మెల్లగా ముందుకు కదిలాడు.

* * *

"ఆదిలాబాదు మండుతోందిరో ........... ఓరన్నయ్యా

ఎర్రబాట చూపుతోందిరో ........."

ఎందుకో పోషాలు బాగా ఉత్సాహంగా ఉన్నట్టున్నాడు. అలా ఉత్సాహంగా ఉన్నపుడు ఏదో పాట అతని నోట్లో ఈలపాటగా మారడం మామూలే. రైఫిల్ బోలు తీసి తుడుస్తూ

మ్యాగజైన్లో తూటాలు సరిచేస్తూ పాడుతున్న ఆ ఈలపాట శ్రావ్యంగా గాలిలో అలలు అలలుగా తేలివస్తోంది. అందరూ అలాంటి పనుల్లోనే వున్నట్టున్నారు.

వాళ్ళు కందకాలు తవ్వడం కోసం వచ్చి ఇక్కడ దూరాన క్యాంపువేసినట్టుగా కన్పించట్లేదు. హాయిగా ఆడుతూ పాడుతూ వనభోజనానికో వనంలోని పిక్నిక్‌కు వచ్చినట్లు కనబడుతున్నారు. సిత్రూ, భీయాల్ లు యుద్ధానికి సన్నద్ధమవుతున్నట్టుగా తూటాల పోచీ సర్దుకుంటున్నారు.

ఎవరో పొయ్యి అంటించి ఉఫ్ ఉఫ్ అని వూదుతున్నారు. గుప్పుగుప్పున పొగలేస్తున్నది. రెండంగల్లో అక్కడికి చేరాడు కరుణాకర్.

"ఏంటి పొయ్యి మీద పెట్టింది?"

"డికాషన్ చాయె"

"చాయెనా? చాయె ఎట్లా చెయ్యాలో నన్నడుగు చెప్తా, ఆగ్లాసు ఇటివ్వు అంటూ ఓ గ్లాసెడు పోసుకుని తాగేసి- 'ప్చ్, ఇంకొంచెం శక్కర పడాలె' అంటూ ఓ పిడికెడు శక్కర వేసి కలిపి టేస్టు చూస్తున్నవాడిలా మళ్ళీ ఓ గ్లాసెడు పట్టిస్తున్నాడు.

ఏవేవో పనుల్లో ఉన్నవాళ్ళంతా అది చూసి ఏవేవో దృశ్యాలు గుర్తొచ్చి నవ్వుతున్నారు. లక్ష్మి నవ్వు వాళ్ళ నవ్వుల్లో విన్పించలేదు.

బ్యాండేజీలు, అదనంగా తెచ్చుకున్న మందులూ, ఇంజక్షను బుడ్డీలు ఓ యివి చాలా ఎక్కువ ....... చాలు అని అన్నీ సర్దిపెడుతున్నాడు సాయన్న. కరుణాకర్‌ని పొయ్యి కాడ చూసి నవ్వుతూ పిలిచాడు.

"కరుణాకర్ యిలారా ..... ప్రాంతీయ వార్తలు వచ్చేటయిమయింది. కొంచెం రేడియో పెట్టు"

రేడియో ఆన్ చేశాడు. ట్యూన్ సరిచేస్తున్నాడు. ఏదో స్టేషన్‌లో "సారే జహాసే అచ్ఛా ........ హిందూస్థాన్ హమారా" వస్తుంటే ఓ క్షణం అలాగే వుంచాడు.

ఓహో యియ్యాల్ల పంద్రాగస్టు. మనదేశానికి "స్వాహాతంత్రం" వచ్చి నలభై ఏళ్ళయింది.

"ఈ సందర్భంగా నీకు మాత్రం ఎక్స్‌ట్రా డబుల్ టీ స్వాతంత్ర్యం దొరికినట్టుందే. కరుణాకర్ భుజం మీద చెయ్యివేసి "స్నానానికి పోదాం పద" అంటూ నవ్వుతూ అక్కన్నించి తీసుకుపోయాడు పోషాలు.

పక్కనే ప్రవహిస్తోన్న సీకుమాను వాగు వరద తగ్గి కొబ్బరి నీళ్ళలా పాలలా తెల్లగా స్వచ్ఛంగా వుంది. నడుంమంటి నీళ్ళయినా ఈత కొడుతుంటే ఎంత హాయిగా వుందో .....

కరుణాకర్‌కి ఈత రాదు. ఒడ్డునే మోకాటిలోతు నీళ్ళలో కూర్చుని స్నానం చేస్తున్నాడు.

"లోతులేదు రా ! కరుణాకర్, ఈకాణ్ణించి పాత పద్ధతులన్నీ పుటం పెడతాం. కొత్త పద్ధతులు నేర్చుకోబోతున్న శుభసందర్భంలో పుణ్యస్నానం ఆచరించుము." అంటూ నవ్వుతూ అతనిమీదికి నీళ్ళు చిలకరించాడు పోషాలు.

ఎన్నాళ్ళకో గాని దొరికిన అవకాశాన్ని వదులుకుంటారా వాళ్ళు. వంటైంది. టైమైంది. అన్న రమ్మంటున్నాడు అని బుచ్చన్న వచ్చి చెప్పేదాకా అలా జలకాలాడుతూనే వున్నారు వాళ్ళు.

కందకాలు తవ్వే ప్రదేశానికి చేరేసరికి అందరూ గంభీరమైపోయారు. అలా ఆటపాటల్తో ఒకరోజు గడిచిపోయింది.

పొజిషన్ తీసుకుని షికారు కోసం ఎదురుచూస్తున్నారు వాళ్ళు.

అలా రెండు రోజులు గడిచిపోతున్నాయి.

గాలి చల్లగా వుంది. కొంత చలిగానూ ఉంది. ప్రసన్నంగానూ వుంది. కమ్మగానూ హాయిగానూ కూడా వుంది. అనిర్వచనీయమైన ఆనందంగా వుంది ప్రకృతి.

ఎటుచూసినా పచ్చగా కళకళలాడుతోంది ప్రకృతి. రెండు వానలు కురవటంతోనే ఆవురావురంటూ అన్ని రకాల పొదలూ పొరకా పెరిగిపోయి చిక్కగా అల్లుకున్నాయి. నేలతల్లి తలారా స్నానం చేసి పచ్చని కురులు ఆరబోసుకుంటున్నట్టుగా ఊగుతున్నాయి ఆకులు, కొమ్మలు. పక్షులు ఆనందంగా ఆకాశంలో కేరింతలు కొడుతున్నాయి. చిమ్మట్లు అదేపనిగా రొదచేస్తున్నాయి. వడ్రంగి పిట్టలు టక్ టక్ మని చెట్లను అదేపనిగా పొడుస్తున్నాయి. పోషాలు ఆలోచనలు అప్పుడే నడక నేరుస్తున్న లేగదూడలా చెంగ చెంగ పరిగెడుతున్నాయి. కాని - కాలం క్షణమొక యుగంగా కదులుతున్నట్టుగా వుంది.

చాపను వెతుక్కుంటూ ఎర వెళ్ళి అప్పుడే ఒకరోజు గడిచిపోతోంది. నన్ను కొట్టారని చెప్పుకోవడానికి వెళ్ళిన పోలీసు ఇన్‌ఫార్మరూ అయిపులేదు. వాడి వెంట తప్పకుండా వస్తారనుకున్న వాళ్ళూ అయిపులేరు.

వాళ్ళు యీ మార్గాన కాకుండా అలా వాగుల్లోంచి పడి వెళ్లలేదుకదా ...... ఇట్లా కాకుండా ఆ రూట్లో వెళ్ళడం అంటే ఇలా ఒకరోజు ఆలస్యం కావడం తప్పదు. వాళ్లు ఆలా వెళ్ళివుంటే పోయేటప్పుడు ఎంతమంది వున్నారో లెక్కపెట్టుకుని తిరిగి వచ్చేటప్పుడు వాళ్ళ పనిపట్టాలనుకున్నారు. కాగా ఇంకా అటువేపు వెళ్ళినట్టే లేదు.

ఎన్నో రీతుల్లో ఆలోచించి ఈ స్థానాన్ని ఎన్నుకోవడం జరిగింది. వాళ్ళు ఒక్కసారి తమ కంటపడ్డారంటే వాళ్ళకు మిగిలేది ఒక్కటే మార్గం - చావడం! లేదా వచ్చిన దారంట వెనక్కి తిరగడమే. అప్పుడు గుళ్ళు సరిగ్గా వాళ్ళ వీపుల్లోంచి దూసుకుపోతాయి. అది తప్ప అటు వెళ్ళడానికి తోవేలేదు. వచ్చాక తప్పుకునే సమస్యే లేదు.

రండ్రా రండి. తొందరగా రండి. నిన్నగాక మొన్న ఇల్లెందులో నలుగురు సికాస కామ్రేడ్స్‌ను పొట్టన బెట్టుకున్నారు. ఒరే! రూముల్లో పట్టుకుని కాల్చిపారేసినట్టు కాదురా ........ రార్రా! నిజంగా ఎన్‌కౌంటర్‌కు రార్రా! ఇది గెరిల్లా యుద్ధం. దా! బేటా దా! మీ సంగతీ, మీ పై వాళ్ళ సంగతీ చెప్తాం రార్రా ! ఇంకా రారేముర్రా!

పిరికిపందలు వెంగ్లాస్‌పూర్‌లో చేసినట్టు చేయరు గదా! గిరిజన భూముల్ని ప్లాంటేషన్ పేర ఆక్రమిస్తూ నఖరాల్ దొబ్బే సారేదార్ దొరక్క దొరక్క దొరికాడు ఆ రోజు. వాణ్ణి పొట్టు పొట్టు తన్ని లారీ కాలబెట్టి ప్లాంటేషన్ పని మూసేయించి ఎంత సేపు చూసినా ఎవడూ ఎదురుకాలేదు. వేరే తోవలో వచ్చి తొందరగానే వెళ్ళిపోయారు. అలా ఆనాడు ప్లాను వుత్తదే అయిపోయింది. అద్దాల తిమ్మాపూర్‌లో జాడమీద చేతికి చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నారు. సిరిమెలలో దాడిచేద్దామనుకుంటే టైం మిస్సయిపాయె. ఈసారయినా చిక్కుతారా లేదా ?

ఎదురుచూసి కళ్ళు నొప్పెడుతున్నాయి.

మబ్బులు వీడిన ఎండ దంచికొడుతోంది. వేసవిలోలాగ డ్రెస్సులు చెమటతో తడిసిపోతున్నాయి.

పావుగంటకోసారి టక్....... టక్ మని వడ్రంగి పిట్టలా శబ్దం చేస్తూనే వున్నారు. ఆ శబ్దం తాము నిద్రపోవడం లేదని చెప్పటానికి గుర్తు. అలర్టుగానే వున్నామని సిగ్నల్ అది.

ఒకసారి కొంచెం కళ్ళెత్తి అటూ యిటూ చూశాడు పోషాలు. కొండ అంచున హంటర్ కొసలా సాగిపోయే బాట. చుట్టూ చెట్లు. కాలిబాటకు రెండు వైపులా రెండు గజాల ఎత్తు బొద మీద తాము. మధ్యలో కాలిబాట. కందకాలు తవ్వడమే కాకుండా మరికొంచెం జాగ్రత్త కోసం ఎత్తుగా పేర్చుకున్న రాళ్ళు. అవి ఎంత సహజంగా వున్నాయంటే ఎన్నో ఏళ్ళుగా అవి అక్కడే వున్నట్టున్నాయి. ఇలాంటివాటిలో సాయన్న దిట్ట. తాము అటు సగం యిటు సగం రెండు టీంలు చీలిపోయి వున్నాము. అయినా నరమానవుడెవరికీ కన్పించే సమస్యే లేదు. సాయన్న ప్లాను ఎంత బాగుందో ......... మరోసారి మెచ్చుకోలుగా గర్వంగా తమ కమాండర్ కేసి చూశాడు పోషాలు.

సాయన్న టక్‌టక్ .......... టక్‌టక్ ......... మంటూ అలర్టుగా వుండమని హెచ్చరించాడే గాని వెంట్రుక మందమైనా తల యిటు కదల్చి చూడలేదు.

అతని దృష్టి అటుకేసి చూస్తోంది. ఆ కళ్ళు తీక్షణంగా వున్నాయి.

సాయంత్రం నాలుగు కావస్తోంది.

అందరికీ విసుగ్గా వుంది. ఇక యిది కూడ యింతే సంగతులు అని లోలోపలే నిరాశపడుతున్నారు వాళ్ళు. సాయన్న మాత్రం యింకా పూర్తి విశ్వాసంతో తదేకంగా వాచికేసి మరోసారి అటుకేసి చూస్తున్నాడు.

అదిగో ఏదో తిట్టుకుంటూ వస్తున్నారు వాళ్ళు. ఒకటి, రెండు, మూడు ...... లెక్కపెడుతున్నాడు సాయన్న. 16తో వాళ్ళ లెక్క పూర్తయింది. అది కౌంట్ డౌన్ కాదు. లెక్కపూర్తి కావడం వాళ్ళు మధ్యలోకి రావడం ఒకేసారి జరిగింది. సాయన్న రావి ఆకు కొసకూడా కదలనంత మెల్లగా తన రైఫిల్ ట్రిగ్గర్ పై వేలును కదల్చాడు.

అదే సిగ్నల్‌గా రెండు వైపుల్నించి తుపాకులు ఒక్కసారిగా గర్జించాయి. ధనాధనామంటూ అడవి దద్దరిల్లిపోయింది. ఎవరిదగ్గరో ఎత్తుకొచ్చిన పోషాలు డొక్కు తుపాకి కొంచెం చిట్లి పొగ కమ్మినట్టుంది. అయినా వణుకు లేదు. బెదురులేదు. కాలుస్తూనే వున్నాడు.

నడుస్తున్న వాళ్లు ఒక్క క్షణం తడబడిపోయారు. మరుక్షణంలో పొజిషన్ తీసుకున్నారు.

క్షణాలు నిమిషాలుగా మారుతున్నాయి. అక్కడ ప్రతి సెకను ఎన్నో సంవత్సరాల విలువైంది. సాయన్న అరసెకను సైతం ఆలస్యం చేయడంలేదు.

యుద్ధం భీకరరూపం దాల్చుతోంది. మహాభారత సంగ్రామానికి శంఖం ఊదుతున్నారు వాళ్ళు. హాహాకారాలు మిన్నుముట్టాయి. శత్రువులు ఒక్కొక్కరూ నేలరాలుతుంటే మరింత కసిగా విజృంభిస్తున్నారు.

అరగంట గడిచిపోయింది. అటునుండి కాల్పులు విన్పించడంలేదు. ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది.

ఎంతో ఉద్వేగంతా గంభీరంగా మెల్లిగా తలెత్తి అటుకేసి చూశాడు పోషాలు. సాయన్న అప్పటికే కందకంలోంచి లేచి నిలబడి అటుయిటు జాగ్రత్తగా పరకాయిస్తున్నాడు. అతనికా దృశ్యం స్పష్టంగా కన్పిస్తోంది. అతను మాత్రం బాటపైకి కన్పించని రీతిలో రాళ్లు ఎండకు నల్లగా తళతళా మెరుస్తున్నాయి.

మిగిలిన ఆర్గురు గాయాల్తో పారిపోయినట్టున్నారు. 10 తుపాకులు 2 రివాల్వర్లు లభించాయనే సంతోషం అరక్షణమైనా మిగల్లేదు. అందర్నీ నవ్విస్తూ నవ్వుతూ లోతైన రాజకీయ

పరిజ్ఞానం గల విలువైన కామ్రేడ్ కరుణాకర్ నేలతల్లి ఒడిలో చేరిపోయాడు. నొసట్లోంచి తూటాలు దూసుకుపోయాయి. అది రక్త తిలకం అద్దినట్టుగా వుంది.

ఆబగా కౌగిలించుకున్నాడు పోషాలు. రెండు కన్నీటిబొట్లు జలజలా రాలిపడ్డాయి.

ఉద్వేగం, సంతోషం, దుఃఖం నిండిన హృదయంతో అశ్రుపూరిత నయనాల్తో సాయన్న కర్తవ్యం గురించి ఆలోచిస్తున్నాడు. ఆదేశాలిస్తూనే వున్నాడు. లక్ష్మి తుపాకుల్ని కుప్పవేస్తోంది.

* * *

కాలం ఎవరికోసమూ ఆగదు. మన్యంలోని ధారగడ్డలో 5 మంది, దండకారణ్యంలోని అల్లంపల్లిలో 10 మంది మట్టికరిచిన సంఘటనలు కూడా పాతబడిపోయాయి. "గుర్తేడు" అధ్యాయం ప్రపంచ చరిత్ర పుటల్లోకి ఎక్కింది.

పోషాలు మళ్ళీ దళంలో చేరి అప్పుడే 22 నెలలు కావస్తోంది. ఈ 22 నెలలు అతనికి 22 ఏళ్ళ జీవితానుభవాల్నిచ్చి మరింత మెజర్ని చేశాయి. రోజులు కూడా భారంగా, దీర్ఘంగా దీర్ఘరాత్రుల్లా గడిచాయి. కాగా ఇటీవలి సంఘటనల్లో తీవ్రమైన గాయాలవడంతో రోజులు మరింత భారంగా గడుస్తున్నట్టున్నాయి.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం కూడా ఒక గొప్పకళే. పోషాలు దీన్ని తన రెండేళ్ళ జైలు జీవితంలో బాగా నేర్చుకున్నాడు. కాలక్షేపాన్ని అధ్యయనంగా మలుచుకున్న అతని తీరును బట్టి గొప్ప విద్యను అభ్యసించినట్టే చెప్పాలి.

అలా కాలక్షేపం కోసం అని కాకుండా కేవలం కథకోసం అని కాకుండా అధ్యయనం కోసమని "ప్రశాంత ప్రత్యూషాలు" నవలని చదువుతున్నాడు. పోషాలు దాన్ని చదవడం అప్పటికి మూడోసారి. జైలుకు వెళ్ళక ముందోసారి జైల్లో మరోసారి, మళ్ళీ యిప్పుడూ అయినా కథలో లీనమైపోయినట్టున్నాడు. రష్యాలోని పోప్ సరస్సు ప్రాంతాల్లో వస్కోవ్. రీతాల దళంలో తనూ ఒక దళ సభ్యుడిగా ఆ వూబిలోని దారులంట నడుస్తూ వున్నాడు. నవల్లోని ప్రతికదలికా అతని కళ్ళ ముందు కదలాడుతోంది. అతనికి ఈ ప్రపంచం చాలా చిన్నదయిపోయి, అతని ప్యాకెట్ డయిరీలో ప్రపంచంలా – అతని పక్క తాలూకా లోని పోరాటంలా అనుభూతి పొందుతున్నాడులా వుంది. తనక్కూడా ఎదురైన అనుభవాలవల్ల అందులోని సంఘటనలు ఈసారి మరింత సజీవంగా కనబడుతున్నాయి.

పోషాలుకు కథలు, నవలలంటే భలే యిష్టం. అది ఎలా ఏర్పడిందో గాని సిద్ధాంత గ్రంథాలయితే తొలుతలో పావుగంటకే నిద్రముంచుకొచ్చేది. కథలు, నవలలంటే అర్ధరాత్రుళ్ళు సైతం తదేకంగా చదివేవాడు. అందుకు జైళ్ళో అతనికి "నైట్‌వాచ్‌మేన్" బిరుదును యిచ్చి సత్కరించారు కూడా తోటి మిత్రులు. అలా జైల్లో ఎన్ని చదివేశాడో. తెలుగులోకి వచ్చిన ప్రపంచ పోరాట సాహిత్యాన్ని దొరికిందల్లా చదివేశాడు. ఇప్పుడు చదవడానికి కొత్త పుస్తకాలే కరువైనాయి. ఇన్ని గొప్ప పోరాటాలు జరుగుతున్నాయి – రాస్తే ఎన్ని గొప్ప నవలలవుతాయో గదా – నిజంగా ఒక్కొక్క అమరుడి జీవిత చరిత్రా – అతను పుట్టి పెరిగిన సాంఘిక ఆర్థిక స్థితిగతుల్ని విశ్లేషిస్తూ ఆ నేపథ్యంలో ఎలా పోరాటాల్లోకి వచ్చాడో – పోరాటాలెలా నడిపాడో రాయాలేగానీ ఒక్కొక్కరి జీవితం ఒక గొప్ప నవలకు సరిపడా సబ్జక్టు కాగలదు. ఇంత మంది విరసం సభ్యులున్నారు. ఏం చేస్తున్నారు వీళ్ళంతా... అని అప్పుడప్పుడు విసుక్కున్నాడు

అయితే యిటీవల సిద్ధాంత గ్రంథాలపై కూడా శ్రద్ధ పెరిగింది. వాటిని చూడగానే నిద్ర ముంచుకురావడమనేది బహుశా జైల్లోనే మటుమాయమైంది. అర్థం కానిదల్లా అడిగినకొద్దీ చెప్పేవాళ్ళు దజన్లకొద్దీ ఉంటం కారణంగా, చదివిందాన్ని గురించి "అమ్మ" నవల్లోలా గంటల తరబడి చర్చించుకునే సావకాశమూ, సఖ్యులూ, మరో కారణం కావచ్చు గానీ అసలు ప్రధానకారణం వేరే వుంది. పార్టీలో వచ్చిన ఆటుపోట్లు, రెండు పంథాల మధ్య పోరాటం అతన్ని నిలదీశాయి. రెండు వాదాలు ఒక్కలాగే కన్పించాయి కొంతకాలం. రెండూ సరిగ్గానే వున్నాయనిపించాయి మరికొంత కాలం. రెంటి మధ్య గల తేడా ఏమిటో అర్థం చేసుకోవడానికి బుర్ర బద్దలు కొట్టుకోవాల్సి వచ్చింది. ఆనక సరైందేదో తనకు తాను నిర్ణయించుకోగలిగే సామర్థ్యం సంపాయించుకోవాల్సి వచ్చింది. దీంతో తాతలు దిగివచ్చినంత పనయింది.

ఇప్పుడతను నక్సల్‌బరీ, శ్రీకాకుళ పోరాటాల చరిత్రను మళ్ళీ అధ్యయనం చేస్తున్నాడు. ఇంతకు ముందు అర్థం కానివేవో యిప్పుడు మంచు కడిగిన ముత్యంలా స్పష్టంగా అర్థం కావడం మరింత అధ్యయనానికి ప్రేరణనిస్తోంది. ఎంతైనా ఏది అర్థం కావాలన్నా కొంత అనుభవమే కాకుండా ఆచరణా, ఉద్యమ స్థాయి కూడా పెరగాల్సి ఉంటుందని "బోల్షివిక్ పార్టీ చరిత్ర" పుస్తకం చదివినప్పుడు అర్థమయ్యింది. దాన్ని పార్టీలో ఆటుపోట్లు రాకముందు చదివితే ఒక్కముక్కయినా ఎందుకు గుర్తుండలేదో, యిప్పుడు ఎందుకు బాగా గుర్తుందో మరోసారి స్పష్టమయ్యింది. దాంతో ఉద్యమచరిత్రనీ ఆటుపోట్లనీ "రెక్టిఫికేషన్ క్యాంపెయిన్" గా అధ్యయనం చేస్తూ ఆలోచిస్తున్నాడు.

అలా జరిగిన చరిత్రనీ, చారిత్రక పత్రాల్నీ చదువుతుంటే అతనిలో ఎన్నో కొత్త వూహలు, కొత్త అంచనాలు కదలాడుతున్నాయి. గెరిల్లా జోన్ నిర్మాణం – గెరిల్లా జోన్ విముక్తి కావడం– విముక్తి ప్రాంతం నుండి ఉత్తరాదిన విస్తరించడమూ – ఇలా ఆలోచిస్తున్నాడతను. ఆలోచించడమే కాదు, ఆచరణలో రాటుదేలుతున్న గెరిల్లా యోధుడతను.

పోషాలులో కొత్త ఆశలు. కొత్త అంచనాలు. కదలాడుతున్నాయి. బతికుంటే తన జీవితకాలంలోనే మళ్ళీ భార్యా పిల్లల్నీ అన్నా వదినల్నీ, లచ్చవ్వనీ, తన ఊరినీ చూసే అవకాశమే కాదు – వాళ్ళతో కొంత కాలం గడిపే అవకాశంకూడా – అదికూడా విముక్తి ప్రాంతంలో స్వేచ్ఛాజీవులుగా – సారవ్వా, అన్నా, వదినా, లచ్చవ్వా సహకార వ్యవసాయపద్ధతుల్లో సమిష్టి వ్యవసాయ పద్ధతుల్లో పనిచేస్తూవుంటే – తాను పనిలో పనిగా అప్పుడప్పుడు వాళ్ళందర్నీ కలిసే అవకాశం లభిస్తుందని కొత్త విశ్వాసం బలీయమవుతోంది.

ఎలాగంటే 'కొడుకులూ – కూతుళ్ళు' నవల్లోలా ఈ వ్యవస్థని మారుస్తూ గ్రామ కమిటీలూ – ఆ నవల్లోని 'మి' లాగా సారవ్వ మహిళా సంగాల్ని నిర్మించడమూ – ఆ క్రమంలో తిరిగి తాము ఒక్కటి కావడమూ ఇలా గెరిల్లాజోన్, విముక్తి ప్రాంతం నుండి ఉత్తరాదికి విస్తరించడమూ –

అలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ మెదదు వేడెక్కినప్పుడల్లా పంట మార్పిడి పథకంలా టాపిక్ మార్చి ఇలా కథలు, నవలలు చదువుతుంటాడతను.

ఇలా తనతోటి సైనికులు అయిదుగుర్ని పోగొట్టుకున్న వస్కోవ్ జర్మన్లపైకి ఒంటరిగా వెళ్ళి దాడిచేసి బంధించాక తమ రష్యన్ సైనికుల రాకను గుర్తిస్తూ నిశ్చింతగా మగతలోకి జారుతున్న ఉద్వేగభరితమైన "ప్రశాంత ప్రత్యూషాలు" నవల చివరి అధ్యాయంలో ఉన్నాడు పోషాలు. కళ్ళు చకచకా సాగుతున్నాయి. ఇంకా పేజీయే మిగిలివుంది.

"నా... నా" అంటూ చిట్టి ఒక్కసారిగా అరచి సంతోషాతిరేకంగా నాన్న గాయాల పట్టీలని లెక్కచేయకుండా ఛాతీని కరుచుకు పోయింది. ఆశ్చర్యంతో అది కలో నిజమో తేల్చుకోలేక ఉద్వేగానికి లోనయ్యాడు పోషాలు. నవలలోని రష్యాలోంచి ఎంతో ప్రయత్నంమీద తానున్న షెల్టరులోకి వచ్చి చూశాడతను.

ఎదురుగా కన్నీళ్ళతో సారవ్వ. అవి కన్నీళ్ళో ఆనంద బాష్పాలో -

చిక్కి శల్యమైన సారవ్వను చూడగానే ఒక్కసారిగా ఎందుకో దుఃఖం, సంతోషం ఆశ్చర్యం, ఉద్వేగం - పోషాలు కళ్ళలోను నీళ్ళు తిరిగాయి.

ఆ గాయాల్ని చూస్తూ అతని ఛాతిపై చిట్టితోపాటు తలాన్చి గొల్లు మంది సారవ్వ. అలా కన్నీరే వారిని సన్నిహితంచేసింది. అది అన్ని విషయాల్ని అర్థం అయిపోయినట్టు చేసింది.

'ప్రశాంత ప్రత్యూషాల్లో'ని జేన్యా, రీతా ఆ అయిదుగురూ ఆ నవల్లోంచి మళ్లీ బతికివచ్చి అతని ఎదుట నిలిచినంత సంతోషంగా వుంది పోషాలుకు. అతను సారవ్వ రాకను ఆశించాడు గానీ పుట్టెడు కష్టాల్లోవచ్చి మళ్ళీ కష్టాలు కొనితెచ్చుకోవడం గనక రాకపోవచ్చునని నిశ్చింత చేసుకున్నాక ఊడిపడంతో మరించ ఉక్కిరిబిక్కిరైనట్టున్నాడు.

తెలిసిన మనుషులు వాళ్ళు. మనుసులు కలిసినవాళ్ళు. ఒక్కపూటలోనే పాతబడిపోయారు. లోకంమీది కబుర్లన్నీ వాళ్ళవే అయిపోయాయి.

వారంరోజులు క్షణాల్లా గడిచిపోయాయి.

వచ్చినప్పుడు తన వయస్సుకు అదనంగా పదేళ్ళపైగా జరాభారంతో దీనంగా వుండేది సారవ్వ.

పోషాలు చెప్పే ఆ కథలన్నీ వింటుంటే యిప్పుడు ఆమె కళ్ళు నిండు విశ్వాసంతో వెలిగిపోతున్నాయి, మరిన్ని కష్టాల్ని ఎదుర్కోవడానికి గుండె గట్టిపరుచుకుంటోంది.

దసరా గడిచిన మరుసటిరోజు మళ్ళీ ఎప్పటికో దర్శనం అన్నట్లు దీనంగా వీడ్కోలు తీసుకుంటోంది సారవ్వ.

"మల్ల ఎప్పుడో... అసలు కలుస్తమో లేదో..."

సారవ్వ భోరున ఏడుస్తోంది.

దుఃఖాన్ని పంటి బిగువున నిలిపి ఓదార్పుగా అన్నాడు పోషాలు.

"మనం మల్లా తప్పకుండా తిరిగి కలుస్తాం. విముక్త ప్రాంతంచేసి ఈ సారి నేరుగా మన ఊరికే వస్తాను సరేనా?" ఉత్సాహంగ అన్నాడు పోషాలు.

చిట్టి. సారవ్వల కళ్ళు మిలమిలా మెరిసాయి.

అరుణ తార మాస పత్రిక - ఆగస్టు 1988